ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ఏఐటీయూసీ 104వ వ్యవస్థాప దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తెడ్డు వెంకటేశ్వరరావు శ్రామిక భవన్ ఏఐటీయూసీ కార్యాలయం నందు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం నేటి వరకు కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటాలను నిర్వహిస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జల్లి రాజబాబు, జిల్లా కో కన్వీనర్ అమర్, సీపీఐ మండల కార్యదర్శి చంటిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాంబాబు, కేశవ్ రాజారావు, బాబి సునీల్, ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ నాయకులు వసంత లక్ష్మి పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణకై, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కోరుతూ నవంబర్ 8న తలపెట్టిన కేజీ టు పీజీ వరకు విద్యాసంస్థల బంద్ వాల్ పోస్టర్లను బుధవారం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రధాన ద్వారం వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ చైర్మన్ ఆదినారాయణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాంబాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయుడు, పీడీఎస్ యూ జిల్లా కన్వీనర్ అభిశ్రీ, విద్యార్థి, యువజన, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కామ్రేడ్ బలరాం ఆశయ సాధనకు కృషి: సీపీఐ

విశాలాంధ్ర - సీలేరు: కామ్రేడ్ కవర్ల బలరాం ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. బుధవారం జికేవీధి మండలం దారకొండ పంచాయతీ చిన్నగంగవరం గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ కవర్ల బలరాం ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం స్థూపాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి మాట్లాడుతూ బలరాం బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిల్లో గోపినాథ్, కవర్ల భగవాన్, గోవిందు, మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకులు పోతురాజు, జిసిసి సీనియర్ సేల్స్‌మేన్ నడిగొట్ల నాగభూషణం, గిరిజన సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షులు కె.మార్చు రాజు, దారకొండ శాఖ కార్యదర్శి మోహన్‌రావు, సీపీఐ నాయకులు కిలో గోపినాథ్, దారకొండ వైస్ సర్పంచ్ దొరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలింగ్‌తో మానసిక సమస్యలకు విముక్తి

విశాలాంధ్ర - మధురవాడ: పోటీ ప్రపంచంలో విద్యార్జనలో, వృత్తిలో ఎదురయ్యే ఒత్తిడులను తట్టుకుని నిలవాలంటే కౌన్సిలింగ్ ద్వారానే సాధ్యమని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అప్లైడ్ సైకాలజీ విభాగంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నిపుణులు సూచించారు. గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడారు. యువతరం తమ చుట్టూ ఉన్న వివిధ ఆకర్షణల ప్రభావానికి లోనై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌వేలీ ఫౌండేషన్ ఛైర్ పర్సన్ ఉమారాజు, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్‌ఛార్జి డీన్ ప్రొఫెసర్ బంది కామయ్య, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.చిన్నయ సూరి, అప్లైడ్ సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడును కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని 90 శాతం పైనే పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఈ దశలో ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించకపోవడం రైతులకు అన్యాయం చేసినట్లేనని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు అన్నారు. బుధవారం సీపీఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడుబాబుతో కలిసి పలు గ్రామాల్లో పంటల స్థితిగతులను పరిశీలించారు. రైవాడ రిజర్వాయర్ ఆయకట్టు గ్రామాల్లో మినహా మిగిలిన గ్రామాల్లో పంటలన్నీ పూర్తిగా ఎండిపోయాయన్నారు. పంట నష్ట వివరాలపై అధికారులు ఇచ్చిన నివేదికలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి

విశాలాంధ్ర - పరవాడ: సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పేర్కొన్నారు. పెదముషిడివాడ పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆయన నక్కవానిపాలెం, పచ్చిగోరు వానిపాలెం, గండివానిపాలెం, విజయరాంపురం గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన ఏకైక నాయకుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర - వి.మాడుగుల: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. రామానాయుడు ఆధ్వర్యంలో బుధవారం బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని జాలంపల్లి, ఎల్.కొత్తపల్లి గ్రామాలలో చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందజేసి బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాణం భీమలింగేశ్వరావు, గోవిందా, కోన చంటి, పల్లా చిన్న, దాసు, రాజు, వర్మ, నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులర్పి ంచారు. పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షులు కారుమూరు మహేష్, కర్నాటి మధుసూదన శెట్టి, కడింశెట్టి వీర్రాజు, కారుమూరి రామకృష్ణ, కులుకూరి శ్రీనివాసరావు, మొగులపల్లి సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్మెంట్‌పై యువతకు శిక్షణ

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల పరిధిలో గల సుజనకోట పంచాయతీ కేంద్రంలో సుజనకోట గ్రామంలో గిరిజన నిరుద్యోగ యువతకు సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ బైక్ మెకానిక్ కంప్యూటర్ కోర్సు తదితర వాటిపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బెటాలియన్ ద్వితీయ కమాండెడ్ నవల కిషోర్ చౌదరి తెలిపారు. బుధవారం మండలం సుజనకోట గ్రామం పరిధిలో గల చుట్టుపక్కల గ్రామాల నిరుద్యోగ యువతకు శిక్షణ నిర్వహిస్తున్నట్టు వినియోగించుకోవాలన్నారు. డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్ మాట్లాడుతూ సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో గిరిజన యువతకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించే చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కె.రవీంద్ర, సర్పంచ్ వెంగడ రమేష్, 198 సిఆర్‌పిఎఫ్ కంపెనీ కమాండర్ ఇన్‌స్పెక్టర్ శివరాజ్ సింగ్, సీఆర్పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

రైల్వే ప్రమాద బాధితులకు పరిహార చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విజయ నగరం జిల్లాలో కంటకపల్లి-అలమండ సెక్షన్‌లో ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో బాధితులకు ఎక్స్‌గ్రేషియా అందించ డంలో రైల్వే, వాల్తేర్ డివిజన్ తక్షణమే సమర్థవంతంగా వ్యవహరించింది. రైలు ప్రమాదంపై స్పందించిన రైల్వే అధికారులు, జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్‌తో సహా వేగంగా చర్యలు చేపట్టారు. ధృవీకరణ ప్రక్రియ తర్వాత 31 తేదీ న చెల్లింపు పూర్తయిన సందర్భంలో మినహా, మరణించిన కేసులకు వాల్టెయిర్ డివిజన్ ద్వారా 20 గంటలలోపు ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందించారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె త్రిపాఠి నేతృత్వంలోని బాధితులకు రైల్వే శాఖ రూ.1.73 కోట్లు ఎక్స్‌గ్రేషియా చెల్లించింది.

చిన్నకొత్తూరుకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలం గెమ్మెలి సచివాలయ పరిధిలో చిన్న కొత్తూరు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మాన పడాల్ డిమాండ్ చేశారు. గ్రామంలో 30 కుటుంబాలు తాత తండ్రుల నుంచి ఈ గ్రామంలో నివసిస్తున్నామని రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ నెల 3వ తేదీన సీపీఎం ప్రజా రక్షణ బేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్, గిరిజన సంఘం మండల కార్యదర్శి దొర, పంచాయతీ నాయకులు సత్తిబాబు, బాలయ్య, నాగభూషణ్, చిన్నబ్బాయి, గణపతి, గ్రామస్తులు శాంతమ్మ, సీతమ్మ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి బెల్లం మార్కెట్ ఖ్యాతిని మరింతగా పెంచాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ ఆవరణలో జరిగిన సభలో మంత్రి అమర్నాథ్ మాట్లాడారు. దేశంలోనే అతి పెద్ద మార్కెట్ యార్డులలో అనకాపల్లి మార్కెట్ యార్డు రెండవ స్థానంలో ఉందని చెప్పారు. గతంలో 40 నుంచి 50 లక్షల బెల్లం దిమ్మలను మార్కెటింగ్ చేసే పరిస్థితులు ఉండేవని, అయితే చెరుకు దిగుబడి తగ్గిపోవడంతో బెల్లం వ్యాపారం తగ్గుముఖం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా గొల్లవిల్లి శ్రీనివాసరావు చాలా కాలంగా పార్టీని నమ్ముకుని జగన్మో హన్ రెడ్డితో కలిసి ప్రయాణం చేశారని, పార్టీ కష్టనష్టాలను కూడా ఆయన చవి చూశారని మంత్రి అమర్నాథ్ చెప్పారు. అన కాపల్లి నియోజకవర్గంలో వైసిపి విజయ కేతనం ఎగురవేయడానికి గొల్లవిల్లి ఎంత గానో కృషి చేశారని అన్నారు.

కార్యక్ర మంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామ రాజు, రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథా రిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, డాక్టర్ బి.లక్ష్మీ నరసింహారావు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ నరమేధానికి వ్యతిరేకంగా 5న ర్యాలీ

విశాలాంధ్ర - విశాఖ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష హత్యాకాండను ఆపాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు విశాఖలోని ఎల్ఐసి అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు పౌర, ప్రజా సంఘాలు, భారత్ బచావో ప్రకటించాయి. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు, ముస్లిం మిత్రులు, ప్రజాస్వా మికవాదులు ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపాయి. ఇజ్రాయిల్ వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని నిర్ణయించినప్పటికీ దాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండించాయి. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న హత్యాకాండకు కేంద్రంలోని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వం పరోక్ష మద్దతు ఇస్తున్నాయని విమర్శించాయి. భారత ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని మార్చుకుని పాలస్తీనాకు పూర్తిగా మద్దతు ప్రకటించాలని, సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త వి.చంద్రశేఖర్, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, భారత నాస్తిక సమాజం జిల్లా నాయకులు రాం ప్రభు, ప్రజ్ఞానంద్ తదితరులు పాల్గొన్నారు.

కరువు కోరల్లో చిక్కుకున్న అనకాపల్లి జిల్లాకు తీవ్ర అన్యాయం

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జున్‌రావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో అనకాపల్లి జిల్లాలో ఒక మండలం కూడా లేకపోవడం రైతులను, వ్యవసాయ కార్మికులను మోసం చేసినట్లేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జున్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో 7 జిల్లాల్లో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇందులో అనకాపల్లి జిల్లాలో ఉన్న ఒక మండలం కూడా లేకపోవడం విచారకరమన్నారు. కరువు కోరల్లో చిక్కుకున్న రైతులను, వ్యవసాయ కార్మికులను ఆదుకోవడానికి అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించడంలోగానీ, ఒత్తిడి తేవడంలో గానీ అధికార పార్టీ నాయకులు ఘోర వైఫల్యం చెందారని విమర్శించారు. జిల్లాలో 7గురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇందులో ఇద్దరు మంత్రులు ఉన్నా కానీ రైతులను, వ్యవసాయ కార్మికులను ఆదుకోవడానికి శ్రద్ధ చూపకపోవడం చాలా దారుణమన్నారు. జిల్లాలో గల కరువు పరిస్థి తులు దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను, కూలీలను ఆదుకోవాలని వెలుగుల అర్జున్‌రావు డిమాండ్ చేశారు.

కంటి చికిత్స కోసం బెయిల్ ఇస్తే సంబరాలు దేనికి?

మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: చంద్రబాబు నాయుడుకి బెయిల్ వచ్చిందని సంబరాలు ఎందుకు జరుపుకొంటున్నారో తనకు అర్థం కావటం లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. బుధవారం అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు కంటి ఆపరేషన్ చేయించుకోవడం కోసం మాత్రమే బెయిల్ ఇచ్చారని అన్నారు. 371 కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని కాజేశాడు కాబట్టే చంద్రబాబును అన్ని రోజులు పాటు జైల్లో ఉంచారని అమర్నాథ్ వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు కేవలం నవంబర్ 27వ తేదీ వరకు మాత్రమే బెయిల్ ఉందని 28వ తేదీ సాయంత్రం తిరిగి ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో సరెండర్ కావాల్సిందేనని మంత్రి అమర్నాథ్ అన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని రద్దీ ప్రాం తాలను గుర్తించి ప్రమాద నివారణ చర్యలను చేపట్టడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లిఖార్జున అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని రద్దీ ప్రాంతాల్లో గల కమర్షియల్ కాంప్లెక్సులలో సెల్లార్ పార్కింగ్ తప్పనిసరిగా ఉండాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను ఆదేశిం చారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా, సెల్ ఫోన్ వినియోగిస్తూ ఆయా వాహనాలను నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకో వాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ జిల్లా రోడ్డు భద్రాతా కమిటీ సమావేశంలో నిర్దేశించిన అంశాలను పరిగణలోకి తీసుకొని చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

అన్ని కూడళ్ల వద్ద బస్ బేలను ఏర్పాటు చేసామని, బ్యూటిఫికేషన్ పనులను కూడా చేపడుతున్నామని కలెక్టరుకు వివ రించారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ ఆర్.సిహెచ్.శ్రీనివా సరావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజినీర్ కె.కాంతిమతి, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణ, సిటీ ప్లానర్ కె.ఎం.దొర పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పరిశుభ్రత చర్యలు చేపట్టండి

జీవీఎంసీ కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో 25వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ గురువారం విశాఖ నగరంలో పర్యటించనున్న సందర్భంగా పరిశుభ్రతా జాగ్రత్తలు పాటించాలని జీవీఎంసీ కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. బుధవారం ఆయన సీఎం పర్యటన రహదారులను జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. సీఎం నగర పర్యటన రోడ్డు మార్గాలలో, మధురవాడ ఐటీ సెజ్ హిల్-3 నందు హెలిపాడ్ ప్రదేశం నుండి రాడిసన్ బ్లూ హోటల్ వరకు చేపడుతున్న పరిశుభ్రతా కార్యక్రమాలను, ఏర్పాట్లను పరిశీలించి, ఏర్పాట్లలో ఎటువంటి ఆటంకాలు, లోపాలు లేకుండా పరిశుభ్రతతో కూడిన పటిష్టమైన చర్యలను చేపట్టాలని అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావుకు, సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ బి.నరేష్ కుమార్, 2వ జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఆర్టికల్చర్ ఎం.దామోదర్‌రావు, ఏసీపి శాస్త్రి, ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో ప్రాజెక్టు ఒప్పందంలో మోడీ, జగన్ వాటా ఎంత...?

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలో నిర్మించ నున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వాటా ఎంత అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. సీపీఎం ప్రజా రక్షణ బేరి బస్సుయాత్ర బుధవారం అనంతగిరి మండల కేంద్రానికి చేరుకుంది. సి.పి.ఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్.నాగులు అధ్యక్షత వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పెద్దకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో వేలాది ఎకరాల అటవీ భూమిని అదాని కార్పొరేట్ కంపెనీ లకు అప్పగించడం తగదన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ఐదో షెడ్యూల్ ప్రకారం గిరిజనుల సాగు భూమిని ఇతరులు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. గిరిజన ప్రాంతంలో 1/ 70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఇది ఎంపీడీవో కార్యాలయమా....? ఫంక్షన్ హాలా...?

విశాలాంధ్ర - పద్మనాభం: ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన మండల కార్యాలయాలు అధికారులకు ఫంక్షన్ హాల్‌లా మారాయని స్థానికులు అంటున్నారు. పద్మనాభం మండలంలో వెంకటాపురం సెక్రటరీ పుట్టినరోజు వేడుకలు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పంచాయతీలకు చెందిన సెక్రటరీలు కొంతమంది మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనడం విశేషం. డ్యూటీ సమయాల్లో పనులు మాని వేడుకలు నిర్వహిం చుకోవడం ఏంటని పలువురు వాపోతున్నారు. కార్యదర్శి జన్మదిన వేడుకలు జరుపుకుంటే వేరేచోట జరుపుకోవాలని, స్వయంగా ఎంపీడీవో వేడుకలు జరిపించడం చర్చనీయాంశంగా మారింది. ఇకనైనా ఇటువంటి కార్యక్రమాలు డ్యూటీ సమయాల్లో కాకుండా ఇతర సమయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో కాకుండా వేరేచోట నిర్వహించుకోవాలని పలువురు కోరుతున్నారు.

నీట్‌లో గిరి పేద విద్యార్థికి సీటు

విశాలాంధ్ర - అరకులోయ: స్థానిక మండలంలోని శరభ గుడ గ్రామానికి చెందిన కొర్ర అవినాష్ అనే గిరి పేద విద్యార్థి నీట్‌లో కంప్యూటర్ సైన్స్‌లో సీటు పొందారు. కొర్ర అవినాష్ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని అరకులోయ ఎంఈఓ వంతల త్రినాథరావు స్పందించి ఆర్థిక సాయం చేసి మానవత్వంను చాటుకున్నారు. ఈ సంద ర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చదువుకునే వారికి సాయం చేయటం ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థిని శరభగూడ గ్రామస్తులతోపాటు వారి కుటుంబీకులు, మండలంలోని పలువురు నాయకులు అభినం దించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పట్టాసి కొండలరావు, ఫల్గాసింగ్ విజయ్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - గొలుగొండ: మండలం ఏఎల్ పురంలో భవిష్యత్తు గ్యారెంటీ ఇది బాబు గ్యారెంటీ అంటూ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. అనంతరం వేణుగోపాల్ మాట్లాడుతూ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపుమేరకు గ్రామంలో ప్రతి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు రిలీజ్ చేసిన మేనిఫెస్టోలోని పథకాలను ఎవరికి ఏ విధంగా వర్తిస్తాయి అన్నదానిపై వివరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

విశాలాంధ్ర - సింహాచలం: స్థానిక విశాఖ పట్నంలోని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రధాన నౌకా పరిశోధనా ప్రయోగశాల అయిన నావల్ సైన్స్ టెక్నలాజికల్ లాబరేటరీలో పిచ్చయ్య ఇండోర్ స్టేడియంలో సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను నిర్వహించింది. ఈ టోర్నీని శాస్త్రవేత్త డాక్టర్ అబ్రహం వర్గీస్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు, డాక్టర్‌లు హెచ్ఎన్ దాస్, బోని రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో రామవరం పంచాయతీ పరిధిలో ఉన్న రామవరం దగ్గర నుంచి హైవేకు కలిసే బిటి రహదారికి గ్రామపంచాయతీ నిధులు సుమారు 8 లక్షల రూపాయలతో బుధవారం పనులు ప్రారంభించామని సర్పంచ్ యర్ర రాజు తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు సహకారంతో ఈ రోడ్డు పనులకు మోక్షం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారికి పెన్షన్ అందజేత

విశాలాంధ్ర - మల్కాపురం: స్థానిక 60వ వార్డు పరిధిలో తలసేమియాతో బాధపడుతున్న ముంజేటి దీపిక కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు గాను మంజూరు చేయించిన ఫించన్ సొమ్మును ఆ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్ బుధవారం సచివాలయ అధికారుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ పి.కావ్య, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఫణీంద్ర బాబు, ఎడ్యుకేషన్ సెక్రటరీ గొంప అప్పలరాజు, సీనియర్ నాయకులు జగ్గ అప్పారావు తదితరులు ఉన్నారు.

మాజీ సైనికోద్యోగి భార్య ఆత్మహత్య

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని రేవిడి గ్రామంలో మాజీ సైనికోద్యోగి బత్తుల కనకరాజు భార్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాల ప్రకారం రేవిడి గ్రామంలో మాజీ సైనికోద్యోగి బత్తుల కనకరాజు భార్య మంగళవారం రాత్రి సుమారు పది గంటల తర్వాత అనుమానాస్పదంగా ఫ్యానుకు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతురాలు తల్లి ఉదయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతురాలు భర్త కనకరాజు, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ విజేత దినేష్‌కు సత్కారం

విశాలాంధ్ర - ఆనందపురం: వెల్లంకి గ్రామానికి చెందిన గొలగాన దినేష్ అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ పెయిర్స్ విభాగంలో రజత పతకం సాధించాడు. అక్టోబర్ 23వ తేదీ నుండి 28వ తేదీ వరకు చైనాలో జరిగిన ఈ అంతర్జాతీయ పోటీల్లో 10 దేశాలకు పైగా క్రీడాకారులు పాల్గొనగా భారతదేశం నుండి పాల్గొన్న దినేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో రజత పతకం సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించిన దినేష్‌ను భీమునిపట్నం శాసనసభ్యులు అవంతి శ్రీనివాసరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆనంద పురం మండల జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, ఎంపీపీ, వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వెల్లంకి గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వైసీపీ నాయకులు కాకర వెంకటరమణ, పిన్నింటి వెంకటరమణ, కంటి మహంతి చంద్రమౌళి, పదాల రాము, తోనంగి అప్పారావు రెడ్డి, దినేష్ తండ్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాఫీ, మిరియాలకు మద్దతు ధర ప్రకటించాలి

విశాలాంధ్ర - అరకులోయ: కాఫీ, మిరియాలకు మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆల్ ఇండియా కిషన్ సభ ప్రధాన కార్యదర్శి అన్నారు. బుధవారం మండలంలోని సుంకరమెట్ట పంచాయితీ పెద్ద గంగ గుడి గ్రామ సమీపంలో పర్యటించి రైతులు పండిస్తున్న కాఫీ తోటలను సందర్శించి పరిశీలించారు. అనంతరం కాఫీ గిట్టు బాటు ధర ఎలా ఉంది ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నారా లేదని రైతులను అడిగి తెలుసుకున్నారు. సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు రైతులు పండించే విధానం రైతులు వివరించారు. పార్చిమెంట్ కాఫీ కిలో 500/-, చెర్రీ కాఫీ కిలో 250/, పండు కాఫీ కిలో 100/-, మంచి మిరియాలు కిలో 1000 రూపాయలకు జీసీసీ కొనుగోలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కిషన్ సభ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్ మాట్లాడుతూ అరకు ఆర్గానిక్ కాఫీకి దేశ విదేశాల్లో మంచి పేరుందని కష్టపడి పండించే రైతుకు మాత్రమే గిట్టు బాటు ధర ఈ ప్రభుత్వం కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం గిట్టు బాటు ధర కల్పించి కొనుగొలు చేయకపోతే కాఫీ రైతు సంఘం ద్వారా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

19వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ పర్యటన

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: పట్టణ మున్సి పాలిటీ పరిధి 19వ వార్డులో బుధవారం ఉదయం మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆ వార్డులో వీధులను మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, వార్డు కౌన్సిలర్ పిట్టా సత్తిబాబులతో కలిసి సందర్శించి అక్కడ నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా అనంతరం ఆమె అక్కడున్న అధికారులతో మాట్లాడుతూ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీలలో పూడుకు పోయిన సిల్టు తొలగించే పనులను చేపట్టి, దోమల లార్వా ఉత్పత్తిని నియంత్రించేందుకు ఆయిల్ బాల్స్‌ను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వీరయ్య, ఏఈ గణపతి సుబ్బారావు, టిపిఓ శ్రీలక్ష్మి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోవింద్, వార్డ్ కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, కో ఆప్షన్ నెంబర్లు దూది నరసింహ మూర్తి, ప్రగడ రమణ పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర - చింతపల్లి: గ్రామ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మహిళల పాత్ర, వారి భాగస్వామ్యం ఏ విధంగా ఉండాలనే దానిపై వెలుగు కార్యాలయంలో వివోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వెలుగు ఏపిఎం నాయుడు అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ.. వైయస్సార్ క్రాంతి పథం ద్వారా నిర్వహించిన గ్రామ అధికార పునరుద్ధరణ కార్యక్రమంలో వివోఏలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో మహిళల పాత్ర, కుటుంబంలో మహిళల అవసరాలు, జీవనోపాధికి ఏమి అవసరం, వ్యక్తిగతంగాను, సమాజంలోనూ సంఘం ద్వారా గ్రామ సంఘానికి అవసరమైన మౌలిక వసతులు, ఈ సంఘాల ద్వారా గ్రామంలో ఏమి చేయగలం, ఆరోగ్యం పట్ల అవగాహన, ప్రతి కుటుంబంలో మహిళలు అంగన్వాడీకి సంబంధించిన పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయా లేదా అనే దానిపై అవగాహన కల్పించడం, అర్హత కలిగి ఉండి పథకాలు అందుకోలేని సంఘ సభ్యులను గ్రామ సంఘం ద్వారా గుర్తించి ఆ వివరాలను సచివాలయంలో తెలియపరచడం అదే క్రమంలో పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించి ఆ కుటుంబాలు నెలకు పదివేల రూపాయలకు పైగా ఆదాయం పెంచుకునేలా జీవనోపాధి ప్రణాళికను సిద్ధం చేసి రూపకల్పన చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి యుఎస్‌వి శ్రీనివాసరావు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ కొండబాబు, వివోఏలు పాల్గొన్నారు.

ఆక్రమణ కూల్చివేత

విశాలాంధ్ర - పరవాడ: గాజువాక - యలమంచిలి ప్రధాన రహదారిని ఆనుకుని పరవాడ పైడిమాంబ హెూటల్ ఎదురుగా గెడ్డ వాగులో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డుపై రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. డిప్యూటీ తహశీల్దార్ గఫర్ తమ సిబ్బందితో వెళ్లి ఆ అక్రమాన్ని ధ్వంసం చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పరవాడ రెవెన్యూ సర్వే నెంబర్ 236లో సుమారు 70 సెంట్లు విస్తీర్ణం గల గెడ్డ వాగు ఉంది. ఇందులో కొంత భాగాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి ఏకంగా షెడ్డును నిర్మించాడు. కొన్నాళ్ళ తర్వాత ఆ షెడ్డును ఓ ట్రాన్స్ పోర్ట్ కార్యాలయానికి అద్దెకు ఇచ్చుకున్నాడు. అప్పటి నుంచి ఆ గెడ్డ వాగు ఆక్రమణపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో పాటు పలు దిన పత్రికలు కూడా దీనిపై వార్తలు ప్రచురించాయి. దీంతో తహసిల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది కొన్ని రోజుల క్రితం గెడ్డ వాగును సర్వే చేయించి ఆక్రమణకు గురైనట్లుగా గుర్తించారు. వెంటనే రేకుల షెడ్డును తొలగించి చర్యలకు ఉపక్రమించినట్లు సర్వే అనంతరం అధికారులు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం గెడ్డ వాగులో నిర్మించిన రేకుల షెడ్డును జేసీబి యంత్రంతో అధికారులు కూల్చి వేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, వీఆర్ఏ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

యూపీఎస్సీ పోటీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: యూపీఎస్సీ నిర్వహించబోతున్న పోటీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం తమ చాంబర్లో యూపీఎస్సీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఈ నెల 4, 5 తేదీల్లో యూపీఎస్సీకి సంబంధించి కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 నుంచి 4.00 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 926 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచెస్, ఇతర స్మార్ట్ పరికరాలను తీసుకురాకూడదని చెప్పారు. ఈ సమావేశంలో పరీక్షల విభాగం సూపరిం టెండెంట్ పాల్ కిరణ్, విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవిన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏపీసీపీఎస్ఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక



విశాలాంధ్ర - నర్సీపట్నం: ఏపీసీపీఎస్ఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక రిషి కళాశాలలో బుధవారం జరిగింది. అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా గాడి సూర్య ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా త్రినాథ స్వామి, ఆర్థిక కార్యదర్శిగా జి.సింహాద్రప్పడు, గౌరవ అధ్యక్షులుగా ఉమామహేశ్వరరావు, సహాధ్యక్షులుగా భరత్, అదనపు కార్యదర్శిగా చిన్నారావు, మహిళా కార్యదర్శిగా ఉమా మహేశ్వరి, రాష్ట్ర కౌన్సిలర్లుగా అప్పలరాజు, రాము, సతీష్, సుబ్బారావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అనే కొత్త బిల్లుని పెట్టడం నమ్మకద్రోహమైన చర్యగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానమైన ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికలలో ఎవరైతే పాత పెన్షన్ విధానానికి స్పష్టమైన హామీ ఇస్తారో వారికే తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టంగా తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4న ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర

విశాలాంధ్ర - జీకేవీధి: ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ఈ నెల4న జీకేవీధి మండలం రంపులకు రానుందని సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ తెలిపారు. బుధవారం జీకేవీధిలో లౌకికవాదం ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా రక్షణ భేరి వచ్చే నెల 15న చలో విజయవాడ కరపత్రంను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుండి బయలుదేరిన గిరిజన రక్షణ ప్రజా బేరి బస్సు యాత్ర, శ్రీకాకుళం, విజయనగరం తర్వాత అల్లూరి జిల్లాకు ఈ నెల 2న రానుందన్నారు. గిరిజనుల సమస్యలే ప్రధాన ఎజెండాగా ఈ బస్సు యాత్ర ఉద్దేశ్యమన్నారు. గిరిజనులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని, కాఫీకి గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలాలలో కాఫీ రైతులు అధికంగా ఉన్నారని కాఫీ పొడి పరిశ్రమ ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో ఉన్న యువతి యువకులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అదే సందర్భంలో మొక్కజొన్న పసుపు పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చునన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పరిశ్రమను గిరిజనులు తిరస్కరిస్తున్నారని, రాజకీయ పార్టీలు తమ విధానాన్ని ప్రకటించాలన్నారు. జెన్‌కో పవర్ ప్రాజెక్టులో స్థానిక గిరిజనులకే ఉపాధి కల్పించాలని జీవో నెంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలని కోరారు. కాఫీ పంటకు 43 రూపాయలు ఐటీడీఏ జీసిసి ప్రకటించడం సరైన గిట్టుబాటు కాదని, కనీసం వంద రూపాయలు ప్రకటించాలన్నారు. 4వ తేదీన ఉదయం 9 గంటలకు రంపులలో సభ జరుగుతుందని ముఖ్య వక్తగా బస్సు యాత్ర రథసారథి సిపిఎం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బారావమ్మ, కిల్లో సురేంద్రతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స తదితరులు పాల్గొంటారన్నారు. కావున ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జీకేవీధి మండల నాయకులు జి.సత్యనారాయణ, కొర్ర బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మండలంలోని సంపత్పురం గ్రామంలో ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేసిన తర్వాతే ఆ భూములను ఇతరులకు కేటాయించాలని రైతులు డిమాండ్ చేశారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతుల వద్ద తీసుకున్న భూముల్లో విశాఖకు చెందిన వ్యక్తులు సెంటు స్థలంలో ఇళ్లు నిర్మిస్తుండగా రైతులు ఆ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ఇరుగులదుర్గ, ఇరుగుల రవనమ్మ, ఇరుగుల లక్ష్మి, నాగులాపల్లి సంజీవరావు, కొణతాల చిరంజీవి, ఉల్లూరి రాజ్యలక్ష్మి, దాకారపు చిన నాగరాజు, దాకారపు చిన్నఅప్పారావు, దాకారపు తాతలు, బరినికనా సీమహచలం నాయుడు, నంబారీ అప్పారావు, పాము పైడి బాబు, చందనాలా అచ్చిబాబు, పంచదార్ల దేముడు, నునబర్తి రామారావు, శివ, అప్పలరాజు మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు మా భూముల్లో ఏ విధమైన పనులు జగనివ్వబోమని రైతులు ముక్తకంఠంతో హెచ్చరించారు. సుమారు 4 సంవత్సరాల క్రితం తమ దగ్గర ల్యాండ్ పూలింగ్ పేరుతో జీడీతోటలనే జీవనాధారంగా మా సాగులో ఉన్న అసైన్డ్ పట్టా భూములను, 25 సంవత్సరాల నుండి ఆక్రమించి జీడీ తోటలతో మా సాగులో ఉన్న భూములను మభ్య పెట్టి బలవంతంగా రెవెన్యు అధికారులు తీసుకున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగేవరకు ఎట్టి పరిస్థితుల్లో తమ భూముల్లో పనులు జరగనివ్వమని హెచ్చరించారు. అంతే కాకుండా ఇప్పుడు కొత్తగా అసైన్డ్ జీవో ప్రకారం 20 సంవత్సరాలు దాటి ఇచ్చిన అసైన్డ్ పట్టాదారులు అందరికి మొత్తం భూమి రెగ్యులరైజేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు తమను ఇబ్బంది పెడితే కోర్టులకు కూడా వెళతామని అన్నారు.

8న విద్యా సంస్థల బంద్

విశాలాంధ్ర - చోడవరం: కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం విశాఖ ఉక్కు పరిరక్షణకి రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు పి. డి.ఎస్.ఒ. జిల్లా అధ్యక్షుడు సియ్యాద్రి రుద్రి తెలియజేశారు. యువజన సంఘాల పిలుపులో భాగంగా కేజీ టూ పీజీ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోస్టర్‌ను బుధవారం విడుదల చేసారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘ నాయకులు మాట్లాడుతూ "స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, స్టీల్ ప్లాంట్‌కి సొంత గనులను కేటాయించాలని, స్టీల్ ప్లాంట్ లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఓ జిల్లా నాయకులు సియ్యాద్రి రుద్రి, ఏ.మౌనిక, కె.నాగేష్, డి.వై.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి యస్.వి. నాయుడు, ఏ.ఐ.ఎస్.ఎఫ్. జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్, ఏ.ఐ.వై.ఎఫ్. జిల్లా కార్యదర్శి వి.రాజు, ఎస్.ఎఫ్.ఐ. జిల్లా సభులు సుందర్, జగత్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లిప్‌కార్ట్ మోటోరోలా స్మార్ట్ ఫోన్లపై భారీ డిస్కౌంట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు ఉత్తమ ఫైవ్ జి స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఫ్లిప్కార్ట్ దీవాళీ సేల్ కు ముందుగా తన స్మార్ట్‌ఫోన్‌లను భారీ తగ్గింపు ధరలకు కొనుగోలు చేయడానికి చివరి అవకాశాన్ని ప్రకటించింది. నవంబర్ ఒకటి నాటికి మోటరోలా ఎడ్జ్, మోటో జి, మోటో ఈ సిరీస్‌లలో చాలా స్మార్ట్‌ఫోన్ లను ఫ్లిప్ కార్ట్ సభ్యులు బిగ్ దీపావళి సేల్‌లో రాయితీ ధరతో కొనుగోలు చేయవచ్చని మోటారోల్లా ప్రతినిధి చెప్పారు. ఐపి 68 రేటింగ్‌తో ప్రపంచంలోనే అత్యంత సన్నదైన 5 జీ స్మార్ట్‌ఫోన్ మోటోరోలా ఎడ్జ్ 40 రూ.26,999 ధరకు లభిస్తోందని అన్నారు.

అమేజాన్ ఫ్రెష్ సూపర్ వేల్యూ డేస్‌లో రాయితీలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అమెజాన్ డాట్ ఇన్ పై 'సూపర్ వేల్యూ డేస్' సమయంలో ప్యాంట్రీని నవంబర్ 7 వరకు ప్రత్యేక ఉత్పత్తులు అందిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. కస్టమర్స్ కిరాణా సరుకులు, నిత్యావసరాలు, ప్యాకేజ్డ్ ఆహారాలు, స్నాక్స్, పానియాలు నిత్యావసరాలు సహా విస్తృత శ్రేణి ఉత్పత్తులపై 50 శాతం వరకు ఆనం దించవచ్చునన్నారు. అదనంగా కస్టమర్స్ ప్రసిద్ధి చెందిన బ్రాండ్స్‌యైన దావత్, ఆశీర్వాద్, డవ్, వేజ్ లైన్ వంటి వాటి నుండి గొప్ప డీల్స్ ఆఫర్స్ ను ప్రాధాన్యతనిచ్చిన సమయాలలో తమ ఇంటి వద్ద సౌకర్యవంతంగా పొందవచ్చునన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అంకితభావంతో ప్రిపరేషన్ కొనసాగించి ఉత్తమ ఫలితాలు సాధించి గిరిజన యువతకు స్ఫూర్తిగా నిలవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శిక్షణకు ఎంపికైన విద్యార్థులను కోరారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన యువతకు అందిస్తున్న సివిల్స్ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం వేపగుంట యూత్ శిక్షణా కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడితే విజ యం సాధ్యమని విజయం సాధించే వరకు రెండు మూడు సంవత్సరాలు సాధన చేయాలన్నారు. ఐటీడీఏ పీఓ అభిషేక్ మాట్లాడుతూ గిరి శిఖర గ్రామాల యువత ఉన్నతమైన ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యంగా ప్రిపరేషన్ చెయ్యాలని అన్నారు. గిరిజన సంక్షేమ ఉప సంచాలకలు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూఓలు ఎల్.రజ ని, అఖిలా రెడ్డిలను సత్కరించారు. అనంతరం శిక్ష ణకు ఎంపికైన అభ్యర్థులతో కలిసి డాక్యుమెంటరీని ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో 21వ సెంచరీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ అధినేత ధరణి, శిక్షణ పొందుతున్న అభ్య ర్థులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

విశాలాంధ్ర - గొలుగొండ: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గొలుగొండ, కొయ్యూరు మండలాల్లో ఇసుక మాఫియా బరితెగించి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. తాండవ నది ప్రవాహ ప్రాంతం బొడ్డేరు గెడ్డలలో ఇసుక స్మగ్లర్లు వివిధ ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పరచుకొని టాక్టర్లు ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేసి తరలిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కి ప్రాంతాన్ని బట్టి 4 వేలు నుండి 5వేలు రూపాయల వరకు అమ్మకాలు చేపట్టి లక్షల్లో ఇసుకపై ఆర్జిస్తున్నారు. ముఖ్యంగా ఈ ఇసుక రవాణాకి రాత్రి పగలు అనే తేడా లేకుండా నిబంధనలకు విరుద్ధంగా స్మగ్లర్లు ఇసుకను దర్జాగా దోచేస్తున్నారు. అంతేకాకుండా మేము చేపట్టే ఈ ఇసుక దందాకు ఏ ఒక్కరూ అడ్డు చెప్పరని తమకు అనుకూలంగా ప్రజా ప్రతినిధులు అధికారులు అండదండలు ఉన్నాయని బహిరంగంగా చెబుతున్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులకు నెలవారి మామూలు ఇస్తున్నామని ట్రాక్టర్ల యజమానులే బహిరంగంగానే చెప్తున్నారు. ఇసుకను తరలించే ట్రాక్టర్ల తొట్టిలకు ఎటువంటి నంబర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకొని మరి ఇసుక దందా సాగిస్తున్నారు.

పురంధేశ్వరికి విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఈ విధంగా మాజీ కేంద్రమంత్రి పురందేశ్వరిపై అనుచితంగా మాట్లాడటం సరి కాదని, విజయసాయి రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని ఎంపీ జీవిఎల్ నర్సింహారావు కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డా. దగ్గుబాటి పురందేశ్వరి పై వైసీపీ నాయకులు విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి పిలుపు మేరకు బీజేపీ విశాఖపట్నం మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాజ్యసభ ఎంపీ జీవిఎల్ నరసింహారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. విష్ణుకుమార్ రాజు, బీజేపీ విశాఖపట్నం జిల్లా ఇంచార్జి పుట్ట గంగయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధా లక్ష్మీ నారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్, పొలిమెర శ్రీనివాసరావు, శ్రీరంగం ధనేశ్వర రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చొక్కాకుల రాంబాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, బీజేపీ మహిళా మోర్చా జోనల్ ఇంచార్జి కట్టా పద్మ పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదలతో సంబరాలు

విశాలాంధ్ర-రాంబిల్లి: స్కిల్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ నుంచి బెయిల్‌పై విడుదలైన సందర్భంగా రాంబిల్లి మండలం రాజకోడూరు గ్రామంలో రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కసిరెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో రాజ కోడూరు, గ్రామ పార్టీ అధ్యక్షులు నూకరాజు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: మధ్యంతర బెయిల్‌పై విడుదల అయి నేడు తిరుపతి వెంకన్న స్వామిని దర్శించుకొని చికిత్సకు బయలుదేరిన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారి చికిత్స విజయవంతం అయి ఆయనపై పెట్టిన అక్రమ కేసుల నుంచి స్వచ్ఛమైన పాలులాగా బయట పడాలని కోరుకుంటూ పెద గంట్యాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాజీ కార్పొరేటర్ కన్నారావు, గోక్యాడ ముత్యాలు, పెద్దాడ సోము నాయుడు, దొమ్మేటి పెరుమాళ్, అండిబోయిన రాము నాయుడు, ములకలపల్లి పెంటయ్య, మొల్లి అప్పారావు, మొల్లి సోము నాయుడు, ముద్దుర్తి సాంబ శివరావు, బస అప్పల రెడ్డి, కాకినాడ అప్పల రాజు, మొల్లి రమణ, మొల్లి అప్పల నాయుడు, టేకేటి పెంటయ్య, టేకేటి అప్పారావు, బొంగు రాజు, ఉరుకుటి వెంకటరావు, ఉరుకుటి అప్పారావు, దొమ్మేటి సోము నాయుడు, పెద్దాడ అప్పల స్వామి, సరోజినీ, లక్ష్మి, నామాల శ్రీకాంత్, మొల్లి అక్తర్, కత్తి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకి మధ్యంతర బెయిల్ మంజూరు కావడంతో మాకవర పాలెం గ్రామంలో మాజీ జడ్పీటిసి రుత్తల శేషుకుమార్, మాకవరపాలెం ఉప సర్పంచ్ లాలం రాము, గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా శర్మ, రుత్తల నాని ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం గొటివాడ అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్లి లింగు నాయుడు (60) అనే వ్యక్తి బుధవారం వీరవల్లి అగ్రహారం గ్రామంలో గల నదిలో ట్రాక్టర్ దిగుతుండగా ట్రాక్టర్ మీద కూర్చున్న లింగునాయుడు జారి పడిపోయి మృతి చెందారు. లింగనాయుడుకి భార్య ముందే చనిపోగా ముగ్గురు కుమారులు, పెళ్లి కావలసిన కుమార్తె ఉన్నారు. మాడుగుల ఎస్సై పి.దామోదర నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

డయల్ యువర్ సీపీకి 17 ఫిర్యాదులు

విశాలాంధ్ర - విశాఖ క్రైం: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ డయల్ యువర్ సి.పి కార్యక్ర మాన్ని గురువారం కమిషనరేట్‌లో నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ 0891-2523408 నంబరు ద్వారా అందుబాటులో ఉండి 17 మంది కాలర్స్‌తో ఫోన్ మాట్లాడి, తమ సమస్యలను తెలుసుకొని, సంబం ధిత అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకొని ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం వడ్డిగూడెం పంచాయతీలోని బీసీ కాలనీ నందు జెడ్పిటిసి నిధులతో పది లక్షల సిసి రోడ్ పనులకు భూమి పూజ శంకుస్థాపన బుధవారం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోడే నరసమ్మ, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ఒడ్డుగూడెం పంచాయతీ సెక్రటరీ స్వరూప్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎఇ సిహెచ్ రామ కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ కోట్ల శ్రీను, ఆచంట శ్రీను, బొర్రా నరేష్ కుమార్, సూర్య ప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ శ్రీధర్‌కు ఆర్డీఓగా పదోన్నతి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: వి.ఆర్.పురం మండలం తహశీల్దార్ ఎన్.శ్రీధర్‌కు రెవిన్యూ డివిజన్ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు పదోన్నతి పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - మాకవరపాలెం : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మాకవరపాలెం సచివాలయ పంచాయతీ కార్యదర్శి సుదర్శనరావు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలం ఎంతోమంది పోరాట ఫలితంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. కార్యక్రమంలో మాకవరపాలెం పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆనంద్, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రెటరీ షర్మిల, అగ్రికల్చరల్ అసిస్టెంట్ నవీన, వెల్ఫేర్ అసిస్టెంట్ పార్వతి, శెట్టి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠవాసుని మెట్ట సందర్శించిన ఈఓ

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి కొండపై వైకుంఠవాసుని మెట్ట, ఆ దగ్గరలో జీఆర్‌టి సంస్థ నిర్మించనున్న శంఖు, చక్రం, నామం ప్రదేశాన్ని ఈఓ ఎస్. శ్రీనివాసమూర్తి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. అప్పన్న ఆలయానికి ఉత్తర భాగంలో ఉన్న వైకుంఠవాసుని సన్నిధి వివరాలను ఇంజినీర్లు ఇఓ వివరించారు.సింహగిరి పై ఏర్పాటు చేయనున్న ఈ తిరునామాలు అనకాపల్లి - ఆనందపురం జాతీయరహదారి లో ప్రయాణించే వారికి కనిపించేల ఏర్పాటు జరుగుతుందని ఈ ఈ చెప్పారు. ఈప్రాంతాన్ని సుందరీకరించి భక్తులు సందర్శించే విధంగా తీర్చిదిద్దాలని ఈఓ సూచించారు. శంఖు, చక్రం, నామం ప్రాంతాన్ని అనుసంధానం చేసుకుంటూ వైకుంఠవాసుని సన్నిధి అభివృద్ధికి ప్రణాళిక వేసుకుంటే బాగుంటుందని ఈఓ అభిప్రాయ పడ్డారు. ఈఓ వెంట ఈ ఈ శ్రీనివాసరాజు, ఏ ఈ రామరాజు(హరి) ఉన్నారు.

యువతుల కోసం 'ప్లాటినమ్ ఎవారా' సమకాలీన ఆభరణాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ నుంచి యువతుల కోసం ప్లాటినం ఎవారా కలెక్షన్ అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు పిజిఐ ప్రతినిధి వెల్లడించారు. పీజీఐ ఇండియా ప్లాటినం ఎవరా కొత్త సేకరణను ప్రారంభించిందన్నారు. 95 శాతం స్వచ్ఛమైన ప్లాటినం నుంచి రూపొందించబడిందని, కల లాంటి నమూనాలు, మోబియస్ లూప్ లు, గ్రూప్లు ప్రత్యేకమైన డిజైన్ కలదన్నారు. ప్లాటినం ఎవారా క్యూరేటెడ్ సేకరణలో ప్రతి భాగం బోర్డ రూమ్ పవర్ డ్రెస్సింగ్ నుంచి మరింత క్లాసిక్, సున్నితమైన బ్రంచ్ సోయిరికి సులభంగా మార వచ్చునన్నారు. ఈ సేకరణలో ఆకర్షణీయమైన నెక్లెస్లు, ఆకట్టుకునే మణికట్టు నుంచి సంక్లిష్టంగా రూపొందించబడిన చెవిపోగులు, సొగసైన రింగ్ల వరకు అనేక రకాల డిజైన్లు ఉన్నాయన్నారు. ఈ డిజైన్లు క్లాసిక్ ఎత్నిక్ లుక్ తో పాటు మరింత ఫార్మల్ కాక్టెయిల్ వేషధారణ రెండింటినీ ఎలివేట్ చేస్తాయన్నారు. మెరిసే వజ్రాలు పొదిగిన డాంగ్లింగ్ ప్లాటినం బార్లు.. ఈ చెవిపోగులు పూల మోటిఫ్ చెవిపోగులు మినిమలిస్ట్ బ్రాస్లెట్ ప్లాటినమ్ రూపొందించబడిందని చెప్పారు.

రిలయన్స్ ఎస్‌బిఐ కార్డ్ విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఎస్?బిఐకార్డ్, రిలయన్స్ రీటెయిల్ కో-బ్రాండెడ్ 'రిలయన్స్ ఎస్‌బిఐ కార్డ్'ను ప్రారంభించుటకు భాగ స్వాములుగా కలిశారు. ఈ ఒకే ఒక్క జీవనశైలి-కేంద్రీకృత క్రెడిట్ కార్డ్, మాస్ నుండి ప్రీమియం వరకు వివిధ అవసరాలు ఉన్న వినియోగదారులకు ఒక సంపూర్ణమైన బహు మతులను ఇచ్చే షాపింగ్ అనుభవాన్ని ఇస్తుందని రిలయన్స్ రీటెయిల్ లిమిటెడ్ డైరెక్టర్ వి. సుబ్ర మణ్యం, ఎస్‌బీఐ కార్డ్ ఎండి అభిజిత్ చక్రవర్తి చెప్పారు. ఈ కార్డు రిలయన్స్ రీటెయిల్ వారి విస్తృతమైన వైవిధ్యమైన పర్యావరణ వ్యవస్థలో, ఫ్యాషన్ జీవనశైలి నుండి కిరాణా సరుకుల వరకు, వినియోగదారు ఎలెక్ట్రానిక్స్ నుండి ఫార్మా వరకు, ఫర్నిచర్ నుండి ఆభరణాల వరకు మరియు మరెన్నో ఉన్న శ్రేణి నుండి లావాదేవీలు జరిపినప్పుడు బహుమతులు ప్రయోజనాలను అందిస్తుందన్నారు. అదనంగా, రిలయన్స్ ఎస్‌బిఐ కార్డ్ యూజర్లు, కొనసాగింపు ప్రాతిపదికన ఎస్?బిఐ కార్డ్ ద్వారా ఆలోచ నాత్మకంగా తయారు చేయబడి అందించబడే ఆఫర్లను కూడా యూజర్లు అందుకోవచ్చునని తెలిపారు.

108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌లకు శిక్షణ

విశాలాంధ్ర - చోడవరం : అనకాపల్లి జిల్లా చోడ వరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గత రెండు రోజులుగా 108లో పని చేస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శిక్షణ తరగతులను ట్రైనర్ సత్య నారాయణ ఆధ్వర్యంలో అత్యవసర సమయాల్లో ఎటువంటి కేసులు ఏ విధంగా ట్రీట్మెంట్ ఇవ్వాలని అనగా ప్రెగ్నెన్సీ, ఆర్టీఏ, పాయిజన్, కార్డియాక్, మరియు రెస్పిరటరి గురించి అవ గాహన ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లాలో ఉన్న 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు అందరు పాల్గొన్నారు. వీరితోపాటు జిల్లా మేనేజర్ వి.త్రినాధ రావు అనకాపల్లి డివిజన్ మేనేజర్ వై నాగేశ్వరరావు నర్సీపట్నం డివిజన్ మేనేజర్ శామ్యూల్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాణమే పునాది

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : నవంబర్ 1 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినో త్సవాన్ని స్టీల్ వై.ఎస్ఆర్.టియు ఆద్వర్యాన స్టీల్ ప్లాంట్ లో కొవ్వొత్తుల జంక్షన్ వద్ద గల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి మరియు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్టీల్ వై.ఎస్ఆర్.టియు యూ నియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ నేడు మనం అనుభవిస్తున్న ప్రతి ఫలాలు మన పూర్వీకులు చేసిన త్యాగాల వల్ల మాత్రమే సాధ్య మైనదని నేటితరం గుర్తుంచుకోవాలన్నారు. మద్రా సియులుగా పిలువబడుతున్న తెలుగువారి కోసం పొట్టి శ్రీరాములు దాదాపు 58 రోజులు దారుణ మరణ వేదనను అనుభవించి ప్రాణత్యాగం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు గురించి ప్రతి తెలుగు వారు తెలుకొని తెలిపారు. ఆయన్ను స్మరించుకోవాలని నవంబర్ 1 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవంగా అధికారికంగా ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి పునరుద్దరణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయక్, శివరామకృష్ణ, కర్రి దాలినాయుడు, గొందేసి రమణారెడ్డి తదితరులున్నారు.

వాల్తేర్ రైల్వే డివిజన్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : వాల్తేర్ రైల్వే డివిజన్‌లో వారం రోజుల పాటు విజిలెన్స్ అవగాహన వారో త్సవాలు ప్రారంభ మయ్యాయి. ప్రతి సంవత్సరం పాటిస్తారు, సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టినరోజుతో సమానంగా జరుపుతున్నారు. గురువారం డిఆర్ఎం కార్యాలయంలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ , అధికారులు, సిబ్బందికి సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. రైల్వే స్టేషన్లు, సబ్-డివిజనల్ యూనిట్లలో డివిజన్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏడిఆర్ ఎం ఇన్ఫ్రా సుధీర్ కుమార్ గుప్తా, ఏడిఆర్ ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మొహంతి ఇతర శాఖల అధికారులు , సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గన్నవరంబీసీ కాలనీ వాసుల నీటి కష్టాలు పరిష్కరించిన సర్పంచ్ భద్రమ్మ

విశాలాంధ్ర - ఎటపాక : గన్నవరంబీసీ కాలనీలో పైప్ లైన్లు బాండ్ మొక్కజొన్న పంటకు సంబందించిన వారు జేసీబీ తో కాలవలు తీయించి ధ్వంసం చేసి పట్టించుకోకుండా వదిలేసిన పైప్ లైన్ ను స్థానిక సర్పంచ్ గడ్డం భద్రమ్మ మరమ్మత్తులు చేపట్టి కాలనీ వారికి మంచి నీరు అందేలా సమస్య పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గన్నవరంలో అనేక ఎకరాల్లో బాండ్ మొక్కజొన్న వేసి లక్షల లాభాలు అర్జిస్తూ తాగునీటి పైప్ లైన్ పగులగొట్టి వదిలి వేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, తాము మాత్రం గ్రామస్తులు కోసం మరమ్మతులు చేయించామని, మా సిపిఐ నాయకులు స్వర్గీయ కందుకూరు మంగరాజు గన్నవరం ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడంలో ముందుండే వారని వారుచూపిన మార్గంలోనే మేము నడుస్తున్నామని తెలిపారు. పైప్ లైన్ మరమ్మతులు చేయించి తమ నీటి కష్టాలు తీర్చిన సర్పంచ్, గ్రామస్థులు, పలువురు హర్షం తెలిపారు.

ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపుకి ఎంపికైన స్పేసేస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని

విశాలాంధ్ర - పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల బి.బి.ఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పైలా హేమలత ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపు కి ఎంపికైనదని కళాశాల ప్రిన్సిపాల్ కె.వీర్రాజు తెలిపారు. ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి 5 గురు ఎంపిక కాగా అందులో హేమలత ఒకరు కావడం గర్వకారణమని తెలిపారు. హేమలత నవంబర్ 1 నుండి 10 వ తేదీ వరకు విజయవాడ కె.ఎల్.యూనివర్సిటీ లో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటుందని తెలిపారు. క్యాంపుకి ఎంపికైన విద్యార్థినిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తదితరులు అభినందించారు.

పాయకరావుపేటలో బాబు షూరిటీ .... భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర - పాయకరావుపేట : పట్టణంలోని 67వ బూతు లో తెలుగుదేశం పార్టీ నాయకులు బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, పల్లా విలియం కేరి, చింతకాయల రాంబాబు, బత్తిన అచ్చిరాజు, జూరెడ్డి ప్రసాద్, లెక్కల గోవింద్, పిన్నింటి సూరిబాబు, చిరుకూరి పేర్రాజు, వేములపూడి అప్పారావు, రాజాన ఆది, గంపల చినరాజు, ముంజులూరి దుర్గాప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తి

విశాలాంధ్ర - మధురవాడ : ఆంధ్రప్రదేశ్ అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమని నకర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఎండాడ లా కాలేజీ రోడ్డు లో గల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, రాష్ట్ర అదనపు కార్యదర్శి జి రవి రెడ్డి, నడింపల్లి కృష్ణంరాజు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ చందర్, వివిధ కార్పొరేషన్ ల చైర్మన్లు పిల్లి సుజాత, పిల్లా సుజాత సత్యనారాయణ, అప్పలకొండ, మాధవి వర్మ, అనుబంధ విభాగాల జోనల్ ఇన్చార్జిలు మారుతీ ప్రసాద్, అల్లంపల్లి రాజబాబు, బెందాలం పద్మావతి, కే రామన్న పాత్రుడు అనుబంధ విభాగాల అధ్యక్షులు బోని శివరామకృష్ణ, ఈశ్వర రావు, కె.వి బాబా, పెంద్ర అప్పన్న, మన్యాల శ్రీనివాస్, నమ్మి లక్ష్మణరావు, నాయుకులు దాడి సత్యనారాయణ, ఆల్ఫా కృష్ణ, మధు సంపతి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : మహనీయులు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంపిపి బోదెపు గోవింద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి, మార్కెట్ సెంట్రల్ లో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంపీడీఓ అప్పలనాయుడు,ఎంపిపి బోదెపు గోవింద్, ఇతరులు పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది,ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు,వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పదవి అంటే బరువు కాదు బాధ్యత

మండల జనసేన పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు

విశాలాంధ్ర - అనందపురం : ఆనందపురం మండలం జనసేన పార్టీ అధ్య క్షుడిగా నియమించినందుకు భీమిలి ఇన్చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్లకూ అలాగే ఆనంద పురం మండల నాయకులు, ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈరోజు ఈ స్థానంలో ఉన్నందుకు గౌరవంగా ఉందని ఆనందపురం మండలం జనసేన పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు తెలిపారు. విశాలాంధ్రతో మాట్లాడుతూ అధ్యక్ష పదవి ఆడంబరం కాదని ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని, జనసేన పార్టీలో నూతన ఉత్సాహానికి నాంది అని మండలంలో త్వరలో చాలామంది పార్టీలో చేరుతారని దీమా వ్యక్తం చేశారు. జనసేన పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి మండల నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, సలహాలు సూచనలు పాటిస్తూ ముందుకు వెళ్తానని అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పై నిత్యం పోరాటానికి జనసేన పార్టీ ఎప్పుడు ముందు ఉంటుందని, పదవి అంటే అలంకారం కాదని బాధ్యతని, మండల కమిటీ నాయకులు సహకారంతో పార్టీని, ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి, అందరూ సహకరించాలని పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ప్రెసిడెంట్ అప్పలరాజు తెలిపారు.

మట్టిలో మాణిక్యం అబిషా కళ

జిల్లా స్థాయి అండర్-17 స్కేట్ బోర్డింగ్ విభాగంలో గోల్డ్ మెడల్

విశాలాంధ్ర - మధురవాడ : మధురవాడ స్వతంత్రనగర్ కు చెందిన ఎస్. ఎఫ్.ఎస్.స్కూల్ విద్యార్థిని బి. అబిషా కళ జిల్లాస్థాయి అండర్-17 కేటగిరీ స్కేట్ బోర్డింగ్ విభాగంలో అత్యంత ప్రతిభని కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. విశాఖపట్నం డిస్టిక్ రోలర్స్ స్పోర్ట్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరి గింది. జిల్లా స్థాయిలో సుమారు 60 మంది క్రీడాకారులపై తన ప్రతిభను కనబరిచి అబిషాకళ ఈఘనత సాధించి జాయింట్ కమిషనర్ వి.ఎం.ఆర్.డి.ఎ. వి.రవీంద్ర చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుంది. గతంలోను ప్రతిభ కనబరిచి స్కేట్ బోర్డింగ్ లో మెడల్స్ గెలుపొందారు. సుమారు 2సంవత్సరాల కష్టం కృషికి ఫలితం దక్కిందని ఈ విజయంపై తల్లిదండ్రులు బి.ఏం.వి.ప్రసాద్ బాబు, శిల్పా దంపతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రతిభ చూపాలని గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఘాటిలో లారీ బోల్తా

విశాలాంధ్ర - మారేడుమిల్లి : వాలమూరు వాలి సుగ్రీవుల బొమ్మల సమీపంలో ప్రమాద మలుపు వద్ద బుధవారం ఉదయం మల్కనగిరి నుండి కాకినాడ కి ధాన్యం లోడుతో వెళ్తుండగా లారీ ఘాటి దిగుతుండగా ప్రమాదపు మలుపులో సాంకేతిక లోపంతో ఆగి ఉన్న లారీని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. లారీలో డ్రైవర్ సోను, క్లీనర్ బుడ్డు క్షేమంగా బయటపడ్డారు.

ఘనంగా శోభన్ బాబు సేవా సంఘం వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖపట్నం, గోపాలపట్నంలో శోభన్ బాబు సేవా సంఘం 16వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా శోభన్ బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. పిదప సోములు మాట్లాడుతూ తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాల్లో అంతులేని ఆప్యాయతనునీ, మరువలేని మమకారాన్ని సుస్థిర స్థానాన్ని పొంది సినీ రంగంలో మంచి నడవడికను ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీసుకువచ్చిన మహా నటుడు శోభన్ బాబు. తను మరణించిన అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. శోభన్ బాబు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు చేపట్టి అనేక సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అభిమానాన్ని చాటుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు అని రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత ,శోభన్ బాబు సేవా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు అన్నారు.

అమరజీవి త్యాగఫలమే నేడు ఆంధ్ర ప్రదేశ్ అవతరణ

నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : స్వాతంత్ర సమరయోధులు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే నేడు ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మతో కలిసి పూలమాల వేసి, అంజలిని ఘటించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడే అయ్యేందుకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధన, త్యాగఫలమే నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ పండుగ జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ అఫ్ అకౌంట్స్ వాసుదేవ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు, జివిఎంసి ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

24న హిందూ సాంప్రదాయ కళల ప్రదర్శన

విశాలాంధ్ర - రాంబిల్లి : ప్రతీ గ్రామంలో హిందూ సాంప్రదాయకళలను ప్రదర్శించే వారందరినీ మండల కేంద్రంలోని ఒక చోటికి చేర్చి కళలను ప్రదర్శించటం ,ఆ కళాకారులను సత్కరించుకోవటం జరుగుతుంది కనుక ఇప్పటి నుండే గ్రామాల్లో కళాకారులకు తెలియజేయాలని బుధవారం నాడు రాంబిల్లి మండల పైడమ్మవారి ఆలయంలో జరిగిన సమావేశంలో "సమరసతా సేవా ఫౌండేషన్" అనకాపల్లి జిల్లా ధర్మ ప్రచారకులు నక్కా సత్యన్నారాయణ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి రోజు చంద్ర కిరణాల ద్వారా జాలువారే అమృతాన్ని వెన్నెలలో పాలు మరిగించటం, అందరికీ పంచటం, దీపాలంకరణ, ఎక్కువ సంఖ్యతో సామూహిక హారతి నిర్వహించాలని, అందరిని భాగస్వాముగా చేర్చాలన్నారు.ఈ నెల9 ,23 తేదీలలో ఏకాదశికి నగర సంకీర్తన చెయ్యాలని,ప్రతీ గ్రామములో హిందూ ధర్మానికి దూరమైన వారిని గుర్తించాలని,వారిని మన ధర్మానికి దగ్గర చేసే ప్రయత్నం చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు, మండల కన్వీనర్ సూరాడ నూకరాజు,కో కన్వీనర్ల చింతకాయల గగన్ కుమార్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - దేవీపట్నం : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదల అయిన సందర్భం ను పురస్కరించుకొని దేవీపట్నం మండలం ఇందుకూరు శివారు ఏనుగుల గూడెం కాలనీలో చంద్రబాబు చిత్ర పటానికి పాలు పువ్వులు వేసి ఘనంగా కొలిసారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా కార్యక్రమం ను చేపట్టారు .ఈ సందర్భంగా రాజామణి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పద్నాలుగు సంవత్సరాలు పాలనలో మకుటం లేని మహరాజులా నీతి నిజాయితీలకు మారు పేరులా పాలన చేపట్టారని పేర్కొన్నారు .అటువంటి బాబు పై ఎన్నికలు సమీస్తున్న వేళా రాజకీయ కుట్రలో భాగంగా కావాలని జైలు లో పెట్టించారని ఇతంతా ప్రజలు గమనిస్తున్నారని వైసిపి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు .ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకలు భారీగా పాల్గొనగా స్వీట్స్ పంచారు .

పేదల సంక్షేమానికే జగనన్న ప్రాధాన్యత : ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విశాలాంధ్ర - మధురవాడ : పేదప్రజల సంక్షేమ మే ప్రధమ ప్రాధాన్యత గా మన ముఖ్య మంత్రి జగన్మోహన్రెడ్డిపాలన సాగిస్తున్నారని,వారికి ఉత్తమ. వైద్యం ఉచితంగా అందించేందుకే ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నా మని భీమిలి శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. బుధ వారం ఆయన మధురవాడ 80 సచి వాలయం పరిధి లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పై విధంగా పేర్కొన్నారు. ముందుగా ఆయన బింద్రానగర్, ధర్మపురి కోలనీ 51వ సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం లో పాల్గొని అనంతరం ఈ పరదేశిపాలెం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఇక్కడ రోగులకు వివిధ విభాగాల వైద్యులు సేవలందించారు. సేవలందిచిన వారిలో వైద్య నిపుణులు డాక్టర్లుఅనంత్,కే.మౌనిక, కే.స్నేహప్రియ, విద్యాధికారులు టి.చైతన్య,లక్ష్మి పార్వతి, దంత వైద్యులు. సిందూరి తదితరులు ఉన్నారు.అనంతరం ఆయన సాయంకాలం 5గం.లకు 69 సచివాలయ పరిధిలో స్వతంత్ర నగర్ హుదుత్ గృహ సముదాయం వద్ద జరిగిన గడప గడపకు కార్యక్రమంలో పాల్గొని జగనన్న నవరత్నాల సంక్షేమ పథకాలను విజయవంతం గా అమలు చేస్తున్న తీరును వివరించి రానున్న ఎన్నికల్లో వైకాపాను మళ్ళీ గెలిపించాలని కోరారు.

సాక్షి పాత్రికేయుడు నాగేశ్వరరావు అకాల మరణం విచారకరం

విశాలాంధ్ర - చింతపల్లి : స్థానిక సాక్షి పాత్రికేయుడు ముక్కలి నాగేశ్వరరావు అకాల మరణం పాత్రికేయ లోకానికి, ముఖ్యంగా చింతపల్లి పాత్రికేయ మిత్రులకు తీరని లోటని చింతపల్లి ప్రెస్ క్లబ్ (చింతపల్లి, జీకే వీధి, సీలేరు) ప్రతినిధులు అన్నారు. సుదీర్ఘకాలంగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతూ మన్య ప్రాంతంలో ఎన్నో ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి అహర్నిశలు కృషిచేసిన నాగేశ్వరరావు అనారోగ్యం బారినపడి అకాల మరణానికి గురికావడం విచారకరమన్నారు.నమ్ముకున్న వృత్తిపై నిబద్ధతతో పాత్రికేయునిగా నాగేశ్వరరావు విశేష సేవలందించారని కొనియాడారు. గతంలో కూడా అనారోగ్యానికి గుర్రై రవి, గౌస్, పెద్దిరెడ్ల నాగేశ్వరరావు, ముక్కలి రాము ఇదే తరహాలో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. యజమాని మృతితో ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులలో కూరుకుపోతున్నాయని ప్రభుత్వం స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు

98.39 లక్షల పనులకు శంఖుస్థాపన

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 92వ వార్డు ఎస్సీ బీసీ కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మాణ పనులకు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఎపి.ఎం.ఎస్.ఎం.ఇ. డిసి చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 92 వ వార్డులో సుమారు 98.39 లక్షల జీవీఎంసీ నిధులతో ఎస్సీబీసీ కాలనీ, మేఘాద్రి గడ్డ, అజంతా పార్క్ వుడా కాలనీ ఏరియాలలో కల్వర్టులు, సిసి రోడ్లు, డ్రెయిన్లు, రిపేర్ వర్క్ లకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో 91 వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు జిఅప్పలస్వామి నాయుడు, జేసిఎస్ మండల ఇన్చార్జి గేదెల మురళీకృష్ణ, కంపర కోటీశ్వరరావు, మల్లేటి భీమయ్య, బల్ల రమణ, సీరపు శంకరరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఎద్దు దేవుళ్ళు, కంపర కనకరాజు, సాలాపు రమణ, కంపర రామకృష్ణ, ఎన్ అరుణ్ కుమార్, సీరపు రెడ్డి, కరణం కన్నారావు ఆర్ పి.మాధురి, జలగం నాగలక్ష్మి, బోనెల నాగరత్నం, కంపర రాజ్యలక్ష్మి, కే.భాగ్య వైఎస్ఆర్ సిపి నాయకులు, కార్యకర్తలు కన్వీనర్లు, వాలంటరీలు, పాల్గొన్నారు.

ఎస్టీ, ఎస్సీ, బీసీలను ముంచి...సాధికారిత యాత్రలతో మోసం : పైలా

విశాలాంధ్ర - కే కోటపాడు : ఆంధ్ర రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసి, ఎస్టీ,ఎస్సీ,బీసీలను నిలువునా ముంచిన వైకాపా నేతలు సాధికారిత యాత్ర పేరిట బస్సుల్లో తిరగడం హాస్యాస్పదంగా వున్నదని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు విమ ర్శించారు. కింతాడ పంచాయితీ జోగన్న పాలెంలో తెలుగుదేశం నేతలతో కలిసి పైలా విలేఖర్లతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి మంత్రి బూడి ముత్యాలనాయుడు వైఫల్యాలపై ధ్వజమెత్తారు. ఉప ముఖ్యమంత్రిగా, రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిగా, నియోజకవర్గ ఎమ్మెల్యేగా బూడి ముత్యాల నాయుడు అన్ని విధాలా విఫలమయ్యారని ఆరోపించారు. మంత్రి కేవలం తారువ గ్రామానికి ఉప ముఖ్యమంత్రిగా మాత్రమే పరిమితమయ్యారని అన్నారు. నవంబర్ 2న మాడుగుల నియోజక వర్గంలో మంత్రి సాధికారత బస్సు యాత్ర చేపట్టడం సిగ్గుచేటుగా వుందని అన్నారు. ఇప్పటివరకు జరిగిన బస్సు యాత్రలు తుస్సు యాత్రలుగా మిగిలిపోయాయని ఆయన విమర్శించారు. మాడుగుల నియోజక వర్గంలో ఉన్న సమస్యలపై యాత్ర పేరిట వచ్చే మంత్రులను నిలదీ స్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కింతాడ మాజీ సర్పంచ్ బందారు నరసింహ నాయుడు, ఎ కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడం నాయుడు, రెడ్డి ప్రభాకర్, రెడ్డి సన్నిబాబు, గొలగాని రమణ, కర్రి నాయుడు, బొట్ట కోనారి, కుబిరెడ్డి మల్లునాయుడు, వెన్నెల అప్పారావు, బొట్ట ముత్యాలు నాయుడు పాల్గొన్నారు.